ట్రాఫిక్ చిక్కుముడికి స్వస్తి

- టపాతోపు గేట్ వద్ద బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జి నిర్మాణం
- శరవేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు
- మూడు మండలాల ప్రయాణికులకు ఊరట
- ఎంపీ, ఎమ్మెల్యే చొరవ ఫలితం


టపాతోపు గేట్ వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణానికి సిద్ధం చేసిన కాంక్రీట్ అచ్చులు

కొడవలూరు: నిరంతరం ట్రాఫిక్ సమస్య ఉన్న మండలంలోని టపాతోపు రైల్వే గేట్ వద్ద బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నెల రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిర్మాణం పూర్తయితే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు టపాతోపు, కొడవలూరు రైల్వే గేట్‌ల వద్ద వేచి ఉండాల్సిన సమస్య ఉండదు.

నిత్యం ట్రాఫిక్ సమస్య

కొడవలూరుతోపాటు మండలంలోని అనేక గ్రామాలు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లాలంటే కొడవలూరు, టపాతోపు రైల్వే గేట్‌లను దాటుకొని వెళ్లాల్సి ఉంది. దీంతో ఈ రెండు చోట్ల గేటు వేశారంటే భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందికరంగా మారడం షరా మామూలే. గేటు తీసినప్పటికీ వాహనాలు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల ట్రాఫిక్ నుంచి బయటపడడం కష్టంగా ఉంటుంది. ఈ మార్గంలో బస్సులు తక్కువే అయినప్పటికీ కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కువైనందున ఈ సమస్య నెలకొంటోంది. కొడవలూరు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదన గత పదేళ్లుగా ఉంది. అయితే ఇక్కడి నేల ఫ్లైఓవర్ వంతెనకు అనుకూలంగా లేదన్న కారణంగా రైల్వేశాఖ ముందుకుసాగడం లేదు.

బాక్స్ టైప్ వంతెనతో ఊరట

కొడవలూరుతోపాటు మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, పద్మనాభసత్రం, తలమంచి, దామేగుంట గ్రామాలకు వెళ్లాలన్నా, అల్లూరు, విడవలూరు మండలాలకు వెళ్లాలన్నా టపాతోపు రైల్వే గేటు దగ్గరి మార్గం కావడంతో ఈ గేటు మీదుగా వాహనదారులు వెళుతుంటారు. కొడవలూరు గేటు మీదుగా వెళ్లాలంటే ఒకటిన్నర కిలోమీటరు దూరం అదనంగా వెళ్లాల్సి ఉండడం వల్ల టపాతోపు గేటు వైపు నుంచే ఎక్కువగా వాహనదారులు వెళతారు. అందువల్లే ఈ గేటు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నందున వాహనాలేవీ నిలవాల్సిన అవసరం ఉండదు. తక్కువ సంఖ్యలో వెళ్లే ఆర్టీసీ బస్సులు మాత్రమే కొడవలూరు గేటు మీదుగా వెళతాయి. దీంతో కొడవలూరు గేటు వద్ద కూడా వాహనాల రద్దీ పూర్తిగా తగ్గుతుంది.


బ్రిడ్జి నిర్మాణం కోసం తీసిన గుంత

ఎంపీ, ఎమ్మెల్యే చొరవతోనే..

కొడవలూరు గేటు, టపాతోపు రైల్వే గేట్‌ల వద్ద ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి రైల్వే అధికారులను కలసి సమస్యను వివరించారు. కొడవలూరు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ మంజూరులో సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతున్నందున టపాతోపు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన రైల్వే ఉన్నతాధికారులు రైల్వే శాఖ నిర్వహణ నిధులతో టపాతోపు వద్ద బాక్స్ టైపు బ్రిడ్జి నిర్మాణానికి ముందుకొచ్చారు. సుమారు రూ.11 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. నిర్మాణ బాధ్యతలను ప్రముఖ కాంట్రాక్టు సంస్థకు అప్పగించి నెల రోజుల్లోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. నిర్మాణానికి అవసరమైన సిమెంట్ కాంక్రీట్ అచ్చులు సిద్ధం చేసి, ట్రాక్ కింద గుంత తీసే పనులను కూడా ప్రారంభించారు.

ఎంతో ఉపశమనం



టపాతోపు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. వ్యాపార రీత్యా నిత్యం నెల్లూరుకు వెళ్లేటప్పుడు రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. టపాతోపు గేటు వైపు వెళదామంటే ఆలస్యమవుతోంది. బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సమస్య తీరుతుంది.
– చిమటా శేషగిరి, దామేగుంట

వాహనదారులకు ఉపయోగం



కొడవలూరు నుంచి నిత్యం నార్తురాజుపాళేనికి వెళ్లాల్సి ఉండడంతో రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. టపాతోపు గేటు మీదుగా వెళితే అక్కడా గేటు వేసి ఉంటారని తప్పని పరిస్థితుల్లో వేచి ఉంటున్నాం. టపాతోపు గేటు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయి.
– కొప్పు రమేష్, కొడవలూరు

ఎంపీ, ఎమ్మెల్యే కృషి ఫలితమే



రైల్వే గేట్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యక్షంగా చూశారు. టపాతోపు వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనతో రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ, ఎమ్మెల్యే కోరిక మేరకు రైల్వేశాఖ నిర్వహణ నిధులతోనే అత్యవసరంగా బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. కొడవలూరు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కూడా ఎమ్మెల్యే, ఎంపీ కృషి చేస్తున్నారు.
– వీరి చలపతిరావు, డీసీఎమ్మెస్ చైర్మన్

నేడు బ్రహ్మదేవిలో 'గడప గడపకు..'

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గురవయ్యసాల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పంచాయతీలో నాలుగు రోజుల పాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

తోటపల్లిగూడూరు: ఆర్టీసీ బస్సులకు సంబంధించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం కోరారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ యూనియన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి బస్సులు సమయానికి గమ్యానికి చేరుకోలేకపోతున్నాయన్నారు. ముఖ్యంగా నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట, నరుకూరు సెంటర్లలో సమస్య అధికంగా ఉందని తెలిపారు. సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది తోటపల్లిగూడూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నెల్లూరు–2 డిపో సంఘం నాయకులు పంటయ్య, ఆర్‌ఎస్ మణ్యం, శేషయ్య, ఏవీ రమణ, సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజా, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన అండర్-19 చెస్ పోటీలు


చదరంగం పోటీల్లో విజేతలు

కోవూరు: స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఈ చెస్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో పలు కేటగిరీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.మస్తాన్‌బాబు తెలిపారు. విజేతలకు హనుమంతరావు, డి.పెంచలబాబు బహుమతులు అందజేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి


దంపూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులైన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని దంపూరులో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజకు తరలిరండి

పొదలకూరు: నెల్లూరు నగరంలోని కొండాయపాళెం గేట్ సమీపంలో నిర్మించే జిల్లా యాదవ భవన్ భూమిపూజ ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని యాదవ భవన్ నిర్మాణ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక బోగోలు కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమిపూజకు ముఖ్యఅతిథులుగా ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యే పి.అనీల్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకుడు బీదా రవిచంద్ర, అల్హా హేచరీస్ చైర్మన్ దూడల సుధాకర్ హాజరవుతారని తెలిపారు. ఈ భవన్‌లో విద్యార్థులకు 70 హాస్టల్ గదులు, కల్యాణ మండపం, మినీ ఫంక్షన్‌హాల్, సంఘ కార్యాలయం గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అనంగి రమణయ్య, రాయి రమణయ్య, మయూరి శ్యామ్‌ప్రసాద్, పద్దాల వేమయ్య, వెడిచర్ల రమణయ్య, శ్రీహరి, లక్ష్మయ్య, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలాధివాసం


జలాధివాసం నిర్వహిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని అలగానిపాడు గిరిజనకాలనీలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విగ్రహాల జలాధివాసం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, హోమాలు, క్షీరాధివాసం, జలాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హోమాలు, కుంభపూజ, అర్చన, ధాన్యాధివాసం, ఫలాధివాసం, చతుర్వేద హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆకురాతి శ్రీనివాసులు – నాగజ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, స్థానికులు కవరిగిరి మల్లికార్జున, శేషయ్య, నాగేశ్వరరావు, పద్మావతి, వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): తల్లీకుమార్తె అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సూళ్లూరుపేటకు చెందిన తులసీ, శ్రావణకుమార్ దంపతుల నడుమ విభేదాలున్నాయి. ఇటీవల ఆమె తన ఏడేళ్ల కుమార్తె ప్రణవికతో కలిసి నెల్లూరు జేవీఆర్ కాలనీలోని తన చిన్నాన్న ఇంటికి ఫంక్షన్ నిమిత్తం వచ్చారు. తమను భర్త ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిన్నాన్నకు చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న భర్త నెల్లూరొచ్చి ఆమెతో గొడవపడ్డారు. ఈ తరుణంలో ఇక నుంచి నీకు కనిపించనని భర్తకు శనివారం మెసేజ్ పంపి కుమార్తెతో సహా అదృశ్యమయ్యారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు ఆమె కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు ప్రతిభా అవార్డులు మంచిపరిణామం



ప్రతిభా అవార్డులు పొందిన విద్యార్థినులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు అందజేయడం మంచి పరిణామం అని, మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు రూరల్ గర్ల్ చైల్డ్ ఎక్సలెన్స్ అండ్ స్కాలర్‌షిప్ అవార్డులను ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో మంత్రి కాకాణి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులతో జిల్లావ్యాప్తంగా 50 జెడ్పీ హైస్కూళ్లను ఎంపిక చేసి ప్రతిభ ఆధారంగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం అద్భుతమైనదని, ఆ పథకం వల్ల ఎందరో చదువుకుని వృద్ధిలోకి వచ్చినట్లు తెలిపారు. ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో పయనిస్తూ రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేసి కేజీ నుంచి పీజీ వరకు పేద విద్యార్థులకు విద్యనందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. పేద విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతను మరవొద్దు

విద్యార్థినీ, విద్యార్థులు తమ బాధ్యతను మరవొద్దని, తాత్కాలిక ఆకర్షణలకు గురై తల్లిదండ్రులకు చెడ్డ పేరు తీసుకురావద్దని మంత్రి కాకాణి సూచించారు. ఆడపిల్లలు ఎందులోనూ తీసిపోరని, చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ విద్యావిధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లలు చదువు మధ్యలో మానేయకుండా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో కోరమాండల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ మాధవన్, ఎస్‌ఎస్‌డీ హెడ్ ఆలీ, డీహెచ్‌ఏ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రతినిధి రాజారెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం.వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు స్రిడ్స్‌కు మంత్రి కాకాణి రాక

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని చెముడుగుంట వద్దనున్న స్రిడ్స్ కల్యాణ మండపానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

బైక్‌లను ఆటో ఢీకొని..

- ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్‌లను ఆటో ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన వెంకటాచలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. నెల్లూరులోని బీవీనగర్ ప్రాంతానికి చెందిన నక్కా సాయికృష్ణ, క్రాంతి ఇద్దరూ వేర్వేరు బైక్‌లపై కసుమూరు వైపు నుంచి నెల్లూరు వైపునకు వెళుతుండగా, వెనుక నుంచి వస్తున్న ఆటో రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికృష్ణ, క్రాంతిలకు గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు


అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ మలోలా

మనుబోలు: ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ మలోలా అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఇతరులకు అనుమతి లేదని, ఓటరు గుర్తింపు కార్డు ఉన్న వారినే అనుమతిస్తారని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్సై ముత్యాలరావు, బీఎల్ఓ బుజ్జయ్య తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి గరుడసేవ

ఇందుకూరుపేట: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి లక్ష్మీనరసింహస్వామికి గరుడసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా జొన్నలగడ్డ మధుసూదన్‌రావు ఉభయకర్తగా వ్యవహరించారు. ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. మేళతాళాల మధ్య స్వామివారికి ఊరేగింపు నిర్వహించగా భక్తులు నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు ఉదయగిరి రంగాచార్యులు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.


మోహినీ అవతారంలో భక్తులను కటాక్షిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

నేడు బుచ్చికి ఎంపీలు, ఎమ్మెల్యే రాక


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక శేషాద్రినగర్‌లో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సోమవారం సాయంత్రం 4 గంటలకు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించేందుకు ఎంపీలు రానుండడంతో ఆదివారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్ల మురళి, చెర్లో సతీష్‌రెడ్డి, చీర్ల ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్, రాఘవరెడ్డి ఉన్నారు.

రామకృష్ణాచార్యులకు జ్యోతిష్య విద్వాన్ బిరుదు


రామకృష్ణాచార్యులను సత్కరిస్తున్న సినీనటుడు సుమన్

ముత్తుకూరు: ముత్తుకూరుకు చెందిన నారాయణం ప్రసన్న రామకృష్ణాచార్యులను ఆదివారం జ్యోతిష్య విద్వాన్ బిరుదుతో సత్కరించారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో సర్ సీవీ రామన్ అకాడమి – శ్రీకృష్ణ సేవా సంస్థాన్ సంయుక్తంగా నిర్వహించిన ఉగాది సువర్ణ కంకణ అవార్డుల సంబరాల్లో ఈ అవార్డు ప్రదానం చేశారు. ప్రముఖ టెలివిజన్, సినీ నటుడు సాయికిరణ పట్టు శాలువతో ఆయనను సత్కరించారు. శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి సువర్ణ కంకణ ధారణ చేయగా, ప్రముఖ సినీనటుడు సుమన్ చేతులమీదుగా ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. అనంతరం రామకృష్ణాచార్యులు సంకలనం చేసిన శోభకృత్ నామ సంవత్సర పాకెట్ పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌పీ కమాండెంట్ డాక్టర్ కేఎన్ రావు, అకాడమీ ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న అట్లూరి శ్రీనివాసులు

కోవూరు: పరస్పర సహకారంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని సహకార భారతి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వేగూరులో ఉన్న ప్రగతి యువకేంద్రం ప్రాంగణంలో ఆదివారం సహకార భారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా సమ్మేళనం నిర్వహించారు. అనంతరం సహకార భారతి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఓ గునపాటి భూపేష్‌రెడ్డి, సహకార భారతి నిర్వాహకులు గంగాధర్, సతీష్‌చంద్ర, ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జానకిదేవి, ఉపేంద్రరెడ్డి, రవిసింగ్, పలు సహకార సంఘాల ఎఫ్‌పీఓలు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

- వినూత్నంగా అడిగిన కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం పరిధిలో ఇంటి పన్ను, కుళాయి పన్ను సకాలంలో చెల్లించాలని ఆదివారం కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు రోజా పువ్వులు ఇచ్చి వినూత్నంగా అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ఇంటి, కుళాయి పన్నులు బకాయిలు ఉన్న వారిని కలిసి, వారికి రోజా పువ్వులు ఇచ్చి పన్నులు చెల్లించాలని కోరామని తెలిపారు. ఇదే రీతిలో నగర పంచాయతీలోని అన్ని ప్రాంతాల్లో తమ సిబ్బంది పన్నుల వసూలు చేపట్టనున్నట్లు తెలిపారు.


రోజా పువ్వు ఇచ్చి పన్ను చెల్లించాలని అడుగుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన ఉండాలని వవ్వేరు హెల్త్‌సెంటర్ ప్రతినిధి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మ, కేశవ పాల్గొన్నారు.